క్లుప్తంగా

మంత్రి సురేష్‌ను సన్మానించిన జెడ్పీటీసీ



మంత్రి సురేష్ సన్మానిస్తున్న జెడ్పీటీసీ ఏడుకొండలు

కొనకనమిట్ల: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను గురువారం మార్కాపురంలోని ఆయన నివాసంలో కొనకనమిట్ల జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ చెప్పారు. తొలుత మంత్రిని జెడ్పీటీసీతోపాటు మండల నాయకులు సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పసుపుగల్లు వీఏఏ సస్పెన్షన్

ముండ్లమూరు: మండలంలోని పుసుపుగల్లు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకురాలిగా పని చేస్తున్న రమావత్ స్వాతిబాయిని సస్పెండ్ చేస్తూ డీఏఓ శ్రీనివాసరావు నుంచి పోస్టల్ ద్వారా ఉత్తర్వులు అందాయని మండల వ్యవసాయాధికారి ఫారుక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–2022 ఖరీఫ్ సీజన్‌లో పంట నష్ట పరిహారం జాబితాలో అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

బేస్తవారిపేట: మండలం సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.చెన్నకేశవరెడ్డి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

ముండ్లమూరు: మండలంలోని పోలవరం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గంగనపాలెం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వెళ్లిన చేవూరి బ్రహ్మన్ని ఎంఈఓలు చంద్రమోహన్, వెంకటేశ్వర్లులు, తోటి ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు అరుణకుమారి, దార్ల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రమణారెడ్డి, శంకర్, ఉదయ్‌కుమార్, సుభాషిణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు మంజూరు

ముండ్లమూరు: మండలానికి ఎల్‌ఆర్‌జీ రకం కందులు 58 క్వింటాళ్లు, 44 కేజీల కొర్రలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఫారుక్ గురువారం తెలిపారు. రైతులకు రాయితీపై విత్తనాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు అందుబాటులోని రైతు భరోసా కేంద్రంలో పొందొచ్చన్నారు.

రెడ్డి కమ్యూనిటీ అధ్యక్షుడిగా తిగిరెడ్డి



భూపాల్‌రెడ్డి (ఫైల్)

బేస్తవారిపేట: మండలంలోని చెట్టిచర్లకు చెందిన మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్ రెడ్డి రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రపరెడ్డి సురేంద్రకరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.వెంకటేశ్వరరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. రెడ్డి సంఘాలతో సమన్వయమై పేద, మధ్య తరగతి రెడ్డి సోదరుల అభివృద్ధి కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు.

సచివాలయం తనిఖీ

కంభం: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి అన్నారు. గురువారం సాయంత్రం కందులాపురం–2 సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించడమే లక్ష్యంగా సచివాలయ ఉద్యోగులు పని చేయాలన్నారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సెక్రటరీ జ్యోష్నలు, సచివాలయ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు పాటుపడాలి

కొమరోలు: క్షయవ్యాధి నిర్మూలన కోసం పాటుపడాలని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షత వహించారు. వైద్యాధికారి డాక్టర్ చైతన్యదీపక్ మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, ఎంపీడీవో నరసయ్య పాల్గొన్నారు.

ఎరువులు పుష్కలం



రాచర్ల రైతు భరోసా కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్



రాచర్లలో రైతు భరోసా కేంద్రంలో యూరియా బస్తాలు



యడవల్లిలో భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయాధికారులు

- రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో డీఏపీ, యూరియా, 20:20:13, 28:28:0
- రాయితీపై విత్తనాలకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

రాచర్ల: రైతులకు కావాల్సిన రాయితీ విత్తనాలు, ఫర్టిలైజర్‌లు, ఎరువులు, నీలిమందులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు చేరాయి. వర్షాలు కురవడమే తరువాయి అన్నట్లుగా రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధంగా ఉన్నారు. పొలాలను దుక్కి చేసుకుని, పశువుల ఎరువులను చల్లుకుని సిద్ధంగా ఉంచుకున్నారు. మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో ఫర్టిలైజర్, ఎరువులను కేటాయించారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో సమృద్ధిగా వర్షాలు కురవడం, పంటలు బాగా పండి మంచి దిగుబడులతో పాటు మద్దతు ధరలు లభించడంతో రైతులు మంచి లాభాలను గడించారు. ఈ ఏడాది కూడా మంచి వర్షాలు కురుస్తాయని సూచనలు ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామస్థాయిల్లో రైతు భరోసా కేంద్రాలను స్థాపించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, భూసార పరీక్షల సేవలను పొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ ఏడాది కూడా ఖరీఫ్ ప్రారంభం నుంచే రైతులకు రాయితీ విత్తనాలు, ఫర్టిలైజర్ ఎరువులను రైతు భరోసా కేంద్రాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సరఫరా చేస్తోంది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 806 హెక్టార్లలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచన వేశారు. కొందరు రైతులు ఇప్పటికే వ్యవసాయ బోర్ల కింద 1300 ఎకరాల్లో పత్తి పంట, పచ్చిమిర్చి 20 ఎకరాలు, మినుములు 50 ఎకరాల్లో సాగు చేశారు.



ఆరవీటికోటలో రైతు భరోసా కేంద్రం భవనం

రైతు భరోసా కేంద్రాలకు కేటాయించిన ఫర్టిలైజర్, ఎరువుల వివరాలు:

ఎరువు రకం	కేటాయించింది (మెట్రిక్ టన్నుల్లో)	ధర (రూ)
డీఏపీ	15	266.50
యూరియా	43.65	1349.98
20:20:13	55	1148
28:28:0	12	1494

వీటితో పాటు ఇప్పటికే రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు, పిల్ల పెసర, కొర్ర విత్తనాల విత్తనం రకం ఎస్ఐఏ-3156 (మహానంది) విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు.

రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి



ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు, మార్కెట్ ధరలకే ఎరువులు అందిస్తున్నాం. మండలానికి రావాల్సిన ఫర్టిలైజర్ ఎరువులు డీఏపీ, యూరియా, 20:20:13, 28:28:0 రైతు భరోసా కేంద్రాలకు చేరింది. ప్రస్తుతం జీలుగ, కొర్ర విత్తనాలు అందిస్తున్నాం. విత్తనాల కోసం రైతులు ముందుగానే నమోదు చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులోని ఎరువుల వివరాలను రైతులకు తెలియజేస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఏడీఏ బాలాజీనాయక్, గిద్దలూరు

పేదరిక నిర్మూలనకు విద్యే సాధనం

- ఎంఈఓ శ్రీనివాసరెడ్డి



చింతగుంపల్లిలో విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పొదిలి రూరల్: సమాజంలో పేదరిక నిర్మూలన జరిగి, అంతరాలు తొలగిపోవాలంటే విద్యే మంచి సాధనమని ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం పొదిలి మండలం అన్నవరం పంచాయతీ చింతగుంపల్లి ఏపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. పేదరికం కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, బూట్లను ప్రభుత్వమే అందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం, రాగిజావ అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు జి వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.రఘురామిరెడ్డి, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ పులి వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ వంకాయలపాటి పద్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఏరియా కో ఆర్డినేటర్ సుధాకర్

మార్కాపురం: డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో మార్కాపురం, యర్రగొండపాలెం క్లస్టర్‌లోని సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు మంజూరు చేయించి, స్వయం ఉపాధిపై అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు మొబైల్ బుక్ కీపింగ్‌లో ప్రతి గ్రామంలో ఏ గ్రేడ్‌లో ఉండేలా చూడాలని యర్రగొండపాలెం క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి కోరారు. సంఘ సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై పూర్తిగా అవగాహన కల్పించాలని కోరారు. రుణాల రికవరీ నూరు శాతం ఉండేలా సిబ్బంది పనిచేయాలని స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్ సూచించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం నరసింహారావు, ఉన్నతి డీపీఎం ప్రసాద్, శేషు, కృపారావు, జి.శ్రీనివాసరావు, సుబ్బారావు, ఏపీఎంలు రమేష్ బాబు, పిచ్చయ్య, పోలయ్య, శ్రీనివాసులు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- లెప్రసీ నివారణాధికారి డాక్టర్ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

మార్కాపురం టౌన్: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు పక్కాగా సర్వే చేపట్టనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్‌లు, నోడల్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని అరవింద ఘోష్ పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి నిర్ధారణ పరీక్షలకు డాక్టర్ వద్దకు పంపాలని చెప్పారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే భయపడాల్సిన పనిలేదని, వ్యాధి తీవ్రతను బట్టి 6 నుంచి 12 నెలలు చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని డీవైఎం హెచ్‌ఓ డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిప్యూటీ పారా మెడికల్ అధికారి రామిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ డాక్టర్లు, లెప్రసీ నోడల్ అధికారులు, ఆశ నోడల్ అధికారుల, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న లోకేశ్వరరావు

దర్శి: ఓటర్ల జాబితా సవరణలపై ప్రత్యేక దృష్టి సారించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్‌లతో గురువారం ఆయన సమావేశమయ్యారు. లోకేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక గుర్తింపు ఉన్న 100 సంవత్సరాలకుపై బడిన ఓటర్లు, ఒకే ఇంటి నంబర్‌పై 10 మంది కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లు, ఇంటి నంబర్‌లు తప్పుగా నమోదైన ఓటర్ల జాబితా, సరిగా లేని ఫొటోలు గుర్తించి సవరణ చేయడం, డూప్లికేట్ ఓట్లు గుర్తించడం, మరణించిన వారి ఓట్ల జాబితా గుర్తించడం, పీడబ్ల్యూడీ ఓటర్లను గుర్తించి వారి జాబితా తయారు చేయడంపై అవగాహన కల్పించారు. డీటీ రవిశంకర్, ఎలక్షన్ డీటీ దేవప్రసాద్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సురేష్

యర్రగొండపాలెం: మండలంలోని గురిజేపల్లి బీసీ కాలనీలో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ రూ.3.50 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో ఏర్పాటు చేసిన డీప్‌వెల్ బోరును గురువారం ఆయన ప్రారంభించారు. తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తమ ప్రభుత్వం నిధులను కేటాయిస్తోందని, తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణ పరిష్కారం కోసం బోర్లు వేయించి నీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. అమూల్య మాట్లాడుతూ ఇటీవల ఆస్పత్రికి రోగులు ఎక్కువ మంది వచ్చి చూయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఎంపీడీవో నరసయ్య, వైద్యాధికారులు డాక్టర్ చైతన్యదీపక్, డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి

పొదిలి రూరల్: రైతులు ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దిన్ సూచించారు. గురువారం పొదిలి మండలంలోని పాములపాడు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అవగహన కల్పించారు.

మేలైన పద్ధతులతో పాడి రైతులు వృద్ధి చెందాలి



మాట్లాడుతున డాక్టర్ లీలాకృష్ణన్

దర్శి: మేలైన పద్ధతులతో పాడి రైతులు వృద్ధి చెందాలని కేవీకే రిసోర్స్ పర్సన్ డాక్టర్ లీలా కృష్ణన్ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బీఐఎస్ఎల్‌డీ సంస్థ, హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన్ సంస్థల ఆర్థిక సాయంతో పా డిరైతులకు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. లీలాకృష్ణన్ మాట్లాడుతూ పాడి రైతుల పశువుల పెంపకం, దూడల పెంపకం, క్రమబద్ధీకరించిన వీర్యం ఉపయోగాలు, మేలు జాతి గడ్డి రకాల పెంపకం, స్వచ్ఛమైన సురక్షిత పాల దిగుబడికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. డాక్టర్ మణికందన్, కో ఆర్డినేటర్ పి.విజయ్ ప్రసాద్, ఏపీఓ వెంకటేశ్ నాయుడు, ఏఐ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతి అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ బాబు

తర్లుపాడు: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా క్విజ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని హెచ్‌ఎం సుధాకర్ పేర్కొన్నారు. గురువారం తర్లుపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీ నిర్వహించారు. చెన్నారెడ్డిపల్లి పాఠశాలకు చెందిన కుందురు కీర్తి, కలుజువ్వలపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన యక్కంటి హేమ, అద్దంకి శైలజ, మీర్జాపేట జెడ్పీ పాఠశాలకు చెందిన స్రవంతి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.250 చొప్పున తర్లుపాడు ఎస్‌బీఐ మేనేజర్ దేవరకొండ బాబు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటి మోహన్, జి.సుజాత, రామారావు, రమేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం త్రిపురాంతకంలో జరుగుతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొననున్నట్లు ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. గ్రామ సచివాలయం-1 ప్రారంభించనున్నట్లు చెప్పారు. అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యా కానుక పంపిణీ

రాచర్ల: మండలంలోని అనుమలవీడు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం జగనన్న విద్యాకానుక కిట్లను ఎంఈవో జి.గిరిధరశర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యాకానుక అందిస్తోందని తెలిపారు. పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్, ఉపాధ్యాయుడు వెలిదండ్ల రమణారెడ్డి పాల్గొన్నారు.

భోజనం నాణ్యంగా ఉండాలి

రాచర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఏంఈవో జి.గిరిధరశర్మ అన్నారు. మండలంలోని అనుమలవీడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్న సురక్ష షెడ్యూల్ విడుదల

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అధికార యంత్రాంగం షెడ్యూల్‌ను స్థానిక ఎంపీడీఓ హేమలత గురువారం విడుదల చేశారు. జూలై 1వ తేదీన గడికోట, అంబవరం, 3వ తేదీన కంచిపల్లె, కొమ్మునూరు, 5వ తేదీన ముండ్లపాడు, 7న కెఎస్‌పల్లె, 10న నరవ, కొత్తకోట, 12 పాదలకుంటపల్లె, ఓబులాపురం, 14న తంబళ్లపల్లె, సంజీవరాయుడుపేట, 17న ఉయ్యాలవాడ, తిమ్మాపురం, 19న వెల్లుపల్లె గ్రామాల్లో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.

దర్శి: ఈ నెల 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీఓ కుసుమకుమారి కోరారు. దర్శి–1, దర్శి–2 అనే రెండు టీమ్‌లుగా ఏర్పడి రోజు మండలంలో రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒకటో తేదీ వెంకటాచలం పల్లి, శామంతపూడి, 3వ తేదీ రాజంపల్లి, రామచంద్రాపురం, 5వ తేదీ పాతకమూరు, పోతవరం, 7వ తేదీ లంకోజనపల్లి, పెద్ద ఉయ్యాలవాడ, 10వ తేదీ కొత్తపల్లి, కొర్లమడుగు, 12వ తేదీ తూర్పువెంకటాపురం, తూర్పు వీరాయపాలెం, 14వ తేదీ తూర్పు చౌటపాలెం, దేవవరం, 17వ తేదీ బొట్లపాలెం, చందలూరు, 19వ తేదీ బండివెలిగండ్ల, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. గ్రామ సచివాలయాల పరిధిలోని 9 రకాల సేవలు అందించనున్నారు.

తాళ్లూరు: మండలంలో జగనన్న సురక్ష పథకం అమలుకు అధికారులతో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. ఒకటో బృందంలో తహసీల్దార్ కేవీ ప్రసాద్, ఈఓఆర్డీ కేజీఎస్ రాజు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులు పీవీఎస్‌ఆర్ మూర్తి, రెండో బృందంలో ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఇస్మానియేల్ రాజు, మండల ప్రజా పరిషత్ సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు ఉన్నారు. ఆయా బృందాలు మండలంలో 14 సచివాలయాల పరిధిలో జూలై ఒకటి నుంచి 14వ తేదీ వరకు జగనన్న సురక్ష పథకం ద్వారా 9 రకాలు సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హనుమంతురావు

దర్శి: ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దర్శికి చెందిన కోటంశెట్టి హనుమంతురావును ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గురువారం స్థానిక ఆ కార్యాలయంలో హనుమంతురావును ఏఐటీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. హనుమంతురావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ నాయకులు సింగరకొండ శ్రీను, గురవయ్య, వాలి, రమాదేవి, యేసు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో ఫీజుల మోతపై ఫిర్యాదు



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బహుజన సైన్యం నాయకులు

మార్కాపురం: డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని బహుజన సైన్యం అధ్యక్షుడు నాగయ్య సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకు గురువారం వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుధంగా 40 వేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు చెల్లించిన తలిదండ్రులకు రసీదులు కూడా ఇవ్వడం లేదని వివరించారు. అధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నోటీసు బోర్డుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల పట్టికను ఏర్పాటు చేసేలా ఆదేశించాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, తిమోతి, సుబ్బయ్య, చిన్నబాబు, జోషఫ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఈవో రాందాస్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పుస్తకాలు, యూనిఫాం, డొనేషన్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కనీస వసతులు లేని ప్రైవేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పవన్, నారాయణ, సందీప్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యం

తాళ్లూరు: ఖరీఫ్‌లో కొర్ర పంట సాగు పెంపే లక్ష్యంగా గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లు పనిచెయ్యాలని మల్కాపురం సర్పంచి వలి అన్నారు. మల్కాపురం పంచాయతీ పరిధిలో గురువారం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల కిట్స్‌ను అందించారు. ఎంపీడీఓ వెంకట రామిరెడ్డి, వ్యవసాయాధికారి ప్రసాదరావు, వీరమాసు వెంకటేశ్వర్లు, ఏఈఓ నాగరాజు, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.